www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily

Date of Publish : 15 August 2026, 3:07 am
Posted by : BHADRADRI NEWS

# పసిపిల్లల ప్రాణాలు పోతున్నా.. పట్టింపు ఏదీ?




**సుజాతనగర్‌లో ఆర్ఎంపీల మితిమీరిన వైద్యం.. యథేచ్ఛగా ఇంజక్షన్లు, సెలైన్ల వినియోగం**

**చిన్నారులకు అధిక మోతాదులో మందులు.. పరిస్థితి విషమిస్తే ఖమ్మానికి రిఫర్**

**ప్రైవేటు ఆస్పత్రులతో కమీషన్ దందా ఆరోపణలు.. అధికారుల పర్యవేక్షణ కరువు**

సుజాతనగర్, ఆగస్టు 14 (తెలంగాణ వాణి) సుజాతనగర్ మండలంలో కొందరు ఆర్ఎంపీలు అడ్డగోలుగా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కనీస వైద్య అర్హతలు లేకపోయినా ఇంజక్షన్లు, సెలైన్లు, యాంటీబయాటిక్స్ వినియోగిస్తూ వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరిస్థితి విషమించిన తర్వాత ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేసి కమిషన్ దండుకుంటున్నారు.

**ఐదేళ్ల చిన్నారి మృతి కలచివేత**

సుమారు 15 రోజుల క్రితం సుజాతనగర్ లైబ్రరీ సమీపంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు ఐదేళ్ల బాలికను కుటుంబ సభ్యులు జ్వరంతో తీసుకెళ్లినట్లు సమాచారం. రెండు రోజులపాటు ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కించినా జ్వరం తగ్గకపోగా చిన్నారి మరింత నీరసించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అనంతరం పరీక్షలు చేయించి అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించడంతో చివరకు ఖమ్మంలోని ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఐదేళ్ల చిన్నారికి మందుల మోతాదుపై ఎలాంటి వైద్య పర్యవేక్షణ లేకుండా చికిత్స చేయడం వల్లే పరిస్థితి విషమించిందన్న ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీశాయి.

**లక్ష రూపాయలతో చేతులు దులుపుకున్నారా?**

చిన్నారి మృతికి సంబంధించి ఆర్ఎంపీల సంఘం జోక్యం చేసుకుని కుటుంబ సభ్యులకు రూ.లక్ష పరిహారం ఇచ్చి వ్యవహారాన్ని ముగించేందుకు ప్రయత్నించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించకుండా భయభ్రాంతులకు గురిచేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**ఒకే కుటుంబం.. నాలుగు కేంద్రాలు?**

మండలంలో కొందరు ఆర్ఎంపీలు సంఘంగా ఏర్పడి వైద్యం చేస్తున్నారని, ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు నాలుగు ప్రాంతాల్లో ఆర్ఎంపీ కేంద్రాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా కేంద్రాలను నిర్వహిస్తున్న వారి విద్యార్హతలు, వైద్య అర్హతలు ఏమిటన్నది సంబంధిత అధికారుల పరిశీలనలోనే తేలాల్సి ఉంది.

**ఇంజక్షన్.. సెలైన్.. యాంటీబయాటిక్!**

జ్వరం, నీరసం, సాధారణ అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులకు కూడా విచక్షణ లేకుండా ఇంజక్షన్లు చేయడం, సెలైన్లు ఎక్కించడం, యాంటీబయాటిక్స్ వాడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులకు మందుల మోతాదు విషయంలో మరింత జాగ్రత్త అవసరమైనప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తున్నారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**ఖమ్మం ఆస్పత్రులకు రిఫర్.. కమీషన్ల ఆరోపణలు**

స్థానికంగా చికిత్సతో పరిస్థితి అదుపులోకి రాకపోతే ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేస్తున్నారు. అక్కడ రోగులు చెల్లించే బిల్లుల్లో 40 నుంచి 50 శాతం వరకు కమీషన్‌గా ఆర్ఎంపీలకు చెల్లిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన అంశమైనప్పటికీ సుజాతనగర్ మండలంలో ఆర్ఎంపీ కేంద్రాలపై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అర్హతలు లేని వ్యక్తులు వైద్యం చేస్తున్నారా? నిబంధనలకు విరుద్ధంగా ఇంజక్షన్లు, సెలైన్లు, యాంటీబయాటిక్స్ వినియోగిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

చిన్నారి మృతి ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మండలంలోని అనధికార వైద్య కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అమాయకుల ప్రాణాలు పోయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. మరో ప్రాణం పోకుండా ముందుగానే అధికారులు మేల్కొనాల్సిన అవసరం ఉంది.

Copyright © 2026 BHADRADRI NEWS. All rights reserved.